512028701

# ప్రబోధ 7

అర్థబలమధికార బలంబులెల్ల
భక్తిముక్తుల సాధింప పనికిరావు
అలు లె విద్యాధనము కూడ ఎన్నడైన
దైవబలము ఒక్కటె దరిని జేర్చు.

అధ్యాపకులారా! విద్యార్థులారా!

చరాచర ప్రపంచము అండజ, పిండజ, స్వేదజ, ఉద్భిజ్జములని చతుర్విధ భూతములతో నిండియున్నది.

అండజములనగా గ్రుడ్లచే ఉద్భవించునవి. అనగా పక్షులు, పాములు, త్రేళ్లు చేపలు, కప్పలు, క్రిమికీటకములు కూడ యీ అండజముల క్రింద చేరిపోతాయి. ఈ గ్రుడ్లచే వుద్భవించే జీవులన్ని 21 లక్షల జాతులుగా వుంటున్నవి. పిండజములనగా గర్భము నుండి పుద్భవించునవి. ఎలుక, పిల్లి, కోతి, కుక్క, మృగము, మనిషి యివన్నీ. గర్భము నుండి వుద్భవించే యీ భూతములు 21 లక్షల జాతులుగా వుంటున్నవి. స్వేదజములనగా మానవుని చమట నుండి పుట్టేవి. ఇవి కేవలం మానవుని యొక్క చెమట మాత్రమే కాదు పశుపక్షిమృగములందు కూడ యిట్టి చెమట వుద్భవిస్తుంది. ఇట్టి చెమట ద్వారా పుట్టే జీవరాసులన్నీ కూడను 21 లక్షల జీవరాసులుగా వుంటున్నవి. అవి యుపేను, నల్లి మొదలైనవి. ఉద్భిజ్జములనగా భూమిని పెకలించుకొని పుట్టే జీవులు. ఇవి విత్తనముల నుండి పుడుతున్నవి. ఈ వృక్షములు పంటలు యివన్నీ కూడను వీటి క్రిందనే చేరతాయి. ఇవన్నీ కూడను 21 లక్షల జీవులుగా వుంటున్నాయి. ఇవన్నీ చేరి 84 లక్షల జాతులుగా జగత్తులో వ్యాపించి వున్నవి. ఈ అన్ని భూతములయందు మానవ జీవితమనేది చాలా శ్రేష్ఠమైనది, వుత్కృష్టమైనది.

తనను తాను ఉద్ధరించుకొనుటకు యీ మానవత్వము చాలా అనుగుణ్యమైనది. భూత భవిష్యత్ వర్తమానములను గుర్తించి వర్తించుకొనే శక్తిసామర్థ్యములను కలిగినది ఈ మానవత్వము. అందువలననే దైవం మానుషరూపేణా దైవం కూడను యిట్టి పవిత్రమైన, ఆదర్శవంతమైన మానవత్వాన్ని ధరిస్తూ వచ్చాడు. అయితే యిట్టి తెలివితేటలు కలిగి, యిట్టి చక్షణా జ్ఞానము వుండి, వివేకము వుండి మానవుడు తన యొక్క తత్వాన్ని, తన స్వరూపాన్ని గుర్తించుకోలేక పోతున్నాడు. దీనికి కారణమేమిటి? కారణము లేని కార్యము జగత్తునందు జరుగుటకు వీలుకాదు. అనేక జన్మల నుండి గావించిన పాపకర్మలు, పుణ్యకర్మల యొక్క ఫలితమే వరియొక్క అనుభూ

212028702

తులకు మూలకారణము. మానవుడు చేసిన సత్కర్మల చేత మనుష్యశరీరమును పొందుతున్నాడు. కాని పాపకర్మలనే జారత్వము, చోరత్వము, అబద్ధము, క్షుద్రమైన కర్మలవల్లనే మానవునికి మలము విక్షేపము, ఆవరణము అనేవి ఆవరించి వుంటున్నాయి.

మలము అనగా అందరికి తెలిసిన విషయమే. ప్రతి మానవుడు భుజించే యనేకవిధములైన ఆహారములన్నికూడను స్థూలరూపకంగా అది మలముగా మారుతుంది. సూక్ష్మరూపకముగా మనస్సుగా మారుతుంది. ఈ మలము మానవుని యందు వుండినంతవరకు అతనికెట్టి సుఖముగాని, comfort గాని, యే విధమైన ఆనందముగాని వుండదు. దానిని విసర్జించకుండిన చాలా బాధలకు గురికావచ్చు. అనేక రోగములుకూడను సంభవించవచ్చును. అందువలనే మలబద్ధమైనవారికి ఎనిమాలని చేయించుకుంటూ వుంటారు. ఏదో ఒక విధముగా దానిని బలాత్కారంచేతనైనా బయటకు లాగివేయాలి. అదే విధముగనే మనసుకు పట్టిన మలాన్ని కూడను మనం విసర్జించాలి. ఈ మలము యేమిటి? అనగా యనేక జన్మలుగా మనం ఆచరించిన దుష్కర్మలయొక్క ఫలితము. అదే జారత్వము, చోరత్వము, అసత్యము, క్షుద్రకర్మలు. ఈ దుష్కర్మల ఫలితముచేత మానవుని తన స్వరూపాన్ని తాను తెలుసుకోలేని స్థితికి అవి గొనిపోతున్నాయి. దీనికో చిన్న కథ.

ఇద్దరు మిత్రులు యెడ ఒక గ్రామాంతరమై దట్టమైన అరణ్యములో ప్రయాణమై వెడుతున్నారు. ఆ పెద్ద అడవి యందు వీరికి పూర్వము ఒక వజ్రాల వర్తకుడు మహారాజు వద్ద కొన్ని వజ్రములను తాను వెలకు తీసుకొని, ఆనాడు కార్లు, బస్సులు లేవు కనుక గుఱ్ఱముపైన ప్రయాణమై తాను అతి వేగముగా తన గృహాన్ని చేరుకోవాలని పోతున్నాడు. ఆ గుఱ్ఱము యొక్క వేగముచేత ఒక డైమండ్ మూట ఆ అడవియందు జారిపడింది. దాని తరువాత యీ యిద్దరు మిత్రులు వెళ్లారు. ఆ యిరువురు యెదా గ్రామాంతరమై వెడుతున్నారు. ఈ మిత్రులు యెలాంటివారు. దేహములు వేరైనా ఒక్క ప్రాణముగా వుండేవారు. అంతసన్నిహిత ప్రేమతత్త్వాన్ని పెంచుకున్నారు. ఒకరిని వదలి ఒకరు ఒక్క క్షణమైనా వుండేవారు కాదు. ఆ యిరువురుకూడ యీ మూటను చూశారు. ఒక మిత్రుడు యీ మూటను విప్పాడు. విప్పేటప్పటికి అతి ప్రకాశవంతముగా మెరుస్తున్న వజ్రాలను చూశారు. ఈ మిత్రులిద్దరు తక్షణమే ఒక మిత్రునికి ఒక విధమైన దుర్భావము కలిగింది. యిదే మలము యొక్క influence. రెండవ మిత్రునితో చెప్పాడు. మిత్రమా! నీ వీ మూటను తీసుకొని ఒక చెట్టు క్రింద కూర్చో. మనకు ఆకలి వేస్తున్నది. నేను యీ దగ్గరలో వున్న పట్టణానికి వెళ్లి కొంత పెరుగన్నము, పులుసన్నము పొట్లములు కట్టించుకొని తెస్తాను. మనమిద్దరము భుజించి, నిదానంగా రాత్రి అయ్యేటప్పటికి గ్రామాన్ని చేరుకుంటాము అన్నాడు. రెండవ మిత్రుడు మంచిది అన్నా అన్నాడు. ఒక చెట్టు క్రింద భద్రముగా యీ మూటను కాపాడుకుంటూ వున్నాడు. ఈ ఆహారాన్ని తీసుకు రావటానికి పట్టణానికి వెళ్లిన వ్యక్తికి క్రమక్రమేణా, క్షణక్షణముకు దుర్భావములు, దుర్బుద్ధులు హెచ్చవుతూ వచ్చాయి. ఒక హోటలుకు వెళ్లాడు పులుసన్నం ఒక ప్యాకెట్టు, పెరుగన్నం ఒక ప్యాకెట్టు తీసుకున్నాడు. అక్కడ

నుండి సరుగా ఒక మెడికల్ షాపుకి వెళ్లాడు. అక్కడకుపోయి మంచి strong poison కావాలి నాకు అన్నాడు. ఈనాటివలె ఆనాడు యీ మెడిసన్స్‌కు కంట్రోలు లేదు. అలాంటి సమయములో వారు అడిగినది యిచ్చారు. మధ్యమార్గంలో యీ పులుసు అన్నంలో కొంచెం, పెరుగు అన్నంలో కొంచెం కలిపి మళ్లీ అవి pack చేసుకొని మిత్రునికివ్వటానికి వస్తున్నాడు. వీని యొక్క మలము వీనిని ఏ రీతిగా బాధిస్తుండగా చెట్టుక్రింద కూర్చున్నవానికి మరింత కఠినమైన దుర్భావములు ఆరంభమైనాయి. నేను తిన్నగా గ్రామం వెళ్లిపోతే యీనాటికైనా వాడు తిరిగి గ్రామం చేరవచ్చు. గ్రామం చేరిన తరువాత నాకే వజ్రాలు చిక్కిన సంగతి గ్రామమంతా చాటవచ్చును. కనుక వీడెట్లైనా లేకుండా చేయాలి. వీని ఏ రీతిగానైనా పొడిచి చంపాలి అనే దుర్భావము వానిలో ప్రారంభం అయింది. వాడు కనుక చనిపోతే యీ వజ్రమండ్లన్నీ నాకే దక్కుతాయి అనే స్వార్థం బయలుదేరింది. ఈ వచ్చిన మిత్రుడు అతిప్రేమతో తమ్ముడూ యిదిగో నీకోసం వంట తెచ్చాను. నీవు భుజించు. నేను యీ చెట్టువద్ద కూర్చుని వీనిని కాపాడతానని ఆ Packet తీసుకొని విప్పుతూ వీనికి అన్నం పెట్టాడు. వీడేమి అన్నం తినలేదు. తినకుండా యేమి చేశాడు. వాడి భక్షించను చూస్తున్న సమయంలో కత్తి తీసుకుని మెడపై వేసి చంపేశాడు. వాడు క్రిందపడి ప్రాణం విడిచాడు. ఇంక నా బంధన పోయిందనుకున్నాడు. వీడప్పుడు చక్కగా ఆ పెరుగన్నము పులుసన్నం తిన్నాడు. తినేటప్పటికి వీడు కొన్ని నిమిషాలకు ప్రాణం విడిచాడు. ఈ మలమనేది యెంతటి ధనవంతుడిన్నైనా, ఎన్ని విధములైన విలువైన వస్తువులు లభించినా వానిని దక్కించుకునే శక్తిసామర్థ్యములు కోల్పోవటమే కాకుండా పరులకు తిరిగి యీ మలము చేత హింసగావించే పాపవృత్తులలో పెడుతుంది. కడపటికి యింత విలువైన వజ్రములు లభించి కూడను యిరువురూ దక్కించుకోలేకపోయారు. కడపటికి అది యెవరికో లభించి వారి ద్వారా ప్రభుత్వానికి చేరిపోయింది.

కనుక మానవుని యందుండిన అనేక జన్మలనుండి వెంటాడుతున్న యీ దుర్గుణములు, దుర్భావములు, దుశ్చేష్టలు అనేవి నిర్మూలం గావించుకోవాలంటే నిరంతరము దైవచింతన చేయాలి. దైవభావముతో నింపాలి. దైవమును ప్రార్థించాలి. చింతించాలి. ఆరాధించాలి. అనుభవించాలి. అదే మానవుని యొక్క మతము. ఈ Religion అంటే యేమిటి? Realisation is religion. Realise చెయ్యాలి. తానెవరో తెలుసుకోవాలి. అలా తెలుసుకోటానికి నిరంతరము మనం యేమి చేయాలి? ప్రతి విషయంలోనూ మనము దైవత్వాన్ని పొందటానికి తగిన ప్రయత్నం చేయాలి. Man must realise God. Feel God. See God. Enjoy with God. Talk with God. That is real religion. ఈ మతాన్ని మనం బోధించుకోటానికి, యీ మతాన్ని మనము అనుభవించుకోటానికి, యీ మతాన్ని మనం అభివృద్ధి గావించుకోటానికి దైవత్వాన్ని మనం పొందాలి. అప్పుడే యీ మలము అన్నివిధాలా నిర్మూలమైపోతుంది. ఏ జన్మలో చేసిన పాపఫలమో తిరిగి యీ జన్మలో కూడను తిరిగి పాపములే చేస్తుంటే యిది పర్వతాల మాదిరి పెరిగిపోతుంది.

512028704

ఈపాపములింకక్షాళించటానికింకవీలుకాదు. మనజన్మసార్థకము కాదు.

ఇంక విక్షేపము. విక్షేపమనగా నిరంతరము చంచలత్వము. అనగా మనసు, శరీరము రెండు కూడను నిరంతరము కదులుతూనేవుంటాయి. శరీరము కదిలిందంటే మనసుకూడను కదులుతుంది. ఈటంబ్లరు కదిలిందంటే లోపల నీళ్లుకూడా కదులులాయి చూడండి. ఈటంబ్లరు స్టడీగావుంటే యీనీరుకూడ స్టడీగావుంటుంది. కనుక మన శరీరమొక పాత్రవంటిది. దానినే ఒక ఘటమంటారు. ఇది యిష్టమొచ్చినట్లు కదులుతూపోతూవుంటే, మైండ్ మరింత కోతి. దానిపైన మరింత అధికమైపోతుంది. ఈ విక్షేపాన్ని మనం దూరం చేసుకోవాలంటే మనము దేనిపైనైనా ఏకాగ్రతఅభివృద్ధిచేసుకోవాలి.

దీనికొక చిన్నకథ. రామకృష్ణపరమహంస, రాణీరసమణి యింట్లో దేవీపూజ చేసుకుంటూ వుండేవాడు. రామకృష్ణుడు చక్కగాపాడేవాడు. అతని గాత్రం చాలా మధురంగా వుండేది. ఒకనాడందరుకూర్చొని, రామకృష్ణుడేదో పాడుతూవుండేసమయంలో, అక్కడ మథురనాథుడుకూడావున్నాడు. మథురనాథుడనగా రాణీరసమణి అల్లుడు. ఆసమయంలో రాణీరసమణి ప్రార్థించింది. రామకృష్ణా! నీ గానము చాలా ఆనందముగావుంటుంది మరొకతూరి పాడినన్నుఆనందపెట్టు అన్నది. కనులుమూసుకున్నాడు. హాయిగా భగవత్ధ్యానములో నామస్మరణ ప్రారంభించాడు. ఈరాసమణి, మిగిలిన చేరినవ్యక్తులందరు కూడను తలలూపుతూ తాళాలువేస్తూ, అన్నివిధాలా ఆనందాన్ని నటిస్తూవచ్చారు. తక్షణమే రామకృష్ణుడు పాటను ఆపివేసి ఒక్కసారిగా రాణీరసమణి దగ్గరకువచ్చి బలంగా చెంపకు బాగా వడ్డించాడు. దెబ్బకొట్టాడు. అందరూ చాలా ఆశ్చర్యపడ్డారు. ఏమిటియీ పొరపాటే. ఆమెచేతికింద పనిచేసేవాడు. ఆమెకింత punishment యిస్తున్నాడే యేమికారణము? ఎందుకోసం! ఆయనకి మధ్యమధ్యయేమైనా పిచ్చియెక్కుతుందా? ఏమిటనియోచిస్తూ వచ్చారు. వారెవరు అడగకపూర్వమే రామకృష్ణుడు జవాబు చెబుతూవచ్చాడు. నీవుకూర్చోటము సత్సంగములో. నీవుప్రార్థించినది గానముచేయమని. నీవు ఆనందించినట్లుగా నటిస్తున్నావు. నీమనసు హైకోర్టులో వున్న కేసు విచారణపైవుంది. మనిషియిక్కడ. మనసక్కడ. Body is present. Mind is absent. ఈవిధమైన సంఘంలో నువ్వెందుకుకూర్చున్నావు. నువ్వు బయటకువెళ్లిపో అని ఖండించాడు. అప్పుడు రాణీరసమణి తనదోషము గుర్తించుకొని, స్వామీ! యీయొక్క విక్షేపానికి యిది సరైనమందు అని తాను ఆనందించింది. అదే విక్షేపముయొక్క దోషము. కూర్చోటం భజనలో. చేసేది భజనచేసినట్లుగా. వేసేది తాళాలు వేసినట్లుగా. ఎక్కడెక్కడో ఆలోచనలు చేసుకోటం. ఎక్కడెక్కడో చెప్పలలో మనం మునిగిపోటం. ఈరకముగా వుండటమనేది విక్షేపముయొక్క పాపఫలము.

ఒకలాయరు. చాలాపేరుపొందినలాయరు. ఆయనింటికి అనేకమందిక్లయింట్లుంతాకూడా యెప్పుడూ రావటం, పోవటం జరుగుతూవుండేది. ఏదో అర్జెంటుకేసుపైన యెవరో

512028705

వచ్చారు. ఆ సమయంలోపల యీలాయరు పూజ రూములో కూర్చున్నాడు. ఓం నమశ్శివాయ అనుకుంటూ
పూజలు చేస్తున్నాడు. దానికి పూర్వము కొంచెం ముందుగా కోడలును పిలిచి యిదో చెప్పాడు. ఇంత
లోపల క్లయింట్లు వచ్చి అమ్మా మీ మామగారు యెక్కడ వున్నారని ప్రశ్నించారు. ఈ కోడలు చాలా
చురుకైన కోడలు. మామగారికి వినిపించేట్లుగా ఏమండి మా మామగారు మాలవాళ్ళ యింట్లో కూర్చున్నారు.
అంది. ఈమాట విన్నాడు లోపలవున్న మామ పరుగెత్తి వచ్చాడు. ఏమే నీకు బుద్ధివుందా లేదా? నేను పూజ
రూములో కూర్చొని వుంటే, చెప్పులు కుట్టేవాని యింట్లో కూర్చున్నావని జవాబు చెబుతున్నావే అని గట్టిగా
కోప్పడ్డాడు. ఈయన పూజ చేస్తూ నమశ్శివాయ, నమశ్శివాయ అంటూ మాలవానికి చెప్పులిచ్చి ఆరుదినా
లైంది. వాడింకా కుట్టలేదు. ఎందుకోసం వాడింకా తేలేదు. ఈతూరి వాని రానీ వాని వీపు పగలగొడతాను.
అని అనుకుంటూ నమశ్శివాయ, నమశ్శివాయ అంటున్నాడు. ఆసంగతే ముందుగా కోడలికి చెప్పాడు
చెప్పులు తెస్తే వాడిని వుండమని చెప్పు. నేను వచ్చి వాడిని కొడతానని. కోడలు యీసంగతి తెలుసుకొని
పూజ రూములోకి పోయి చెప్పుల గురించి యెందుకు విచారించటం అని యీమె వుండటం పూజ
రూములో కాని బుద్ధి మాలవాని యింట్లో వుందని కరెక్టుగా చెప్పింది. అనగా చేసేది ఒకపనిగా వుండే
నప్పుడు ఆ పనిలో మనం concentrate చేయాలి. కాని దానిని వదిలి అనవసరమైన విషయాల
లోకి పోవటం యిది విక్షేపము యొక్క మహాత్మ్యము. కనుక విక్షేపమనేది యెప్పుడు చూసినా కూడను
మనసు, శరీరము కదలుతూ కదలుతూ వుంటుంది. ఇది కోతి కంటె హీనమైన జాతిగా తయారవుతుంది.

ఇంక ఆవరణము. ఈ ఆవరణ మనగా యేమంటే మనల నావరించి వుండేది. నేను విద్యా
ర్థిని, నేను ఉపాధ్యాయుడను, నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను స్త్రీని, నేను పురుషుడను. ఈ విధము
గా కొన్ని విధములైన భావములు ఆవరించటమే. కేవలం యీ శరీరము నేననే అజ్ఞానం చేతనే వీడు
యివిధమైన విభాగములు చేస్తూ వున్నాడు. ఈ student యెవరు? దేహాన్ని బట్టి నువ్వు student
అంటున్నావు. నేను టీచరును. నీ దేహతత్వాన్ని బట్టి నవు టీచరు అనుకుంటున్నావు. నేను బ్రాహ్మ
ణుడను, నేను క్షత్రియుడను, నేను శూద్రుడను, నేను పురుషుడను, నేను స్త్రీని, నేను యవ్వనుడ
ను, నేను వృద్ధుడను అని యీరకంగా అనుకోటం కేవలం దేహభ్రాంతి చేతనే యీ భావలన్నీ ఆవరి
స్తూ వస్తున్నాయి. నీవు ఆత్మరీతిగా చూస్తే నీవు బ్రాహ్మణుడవు కావు. శూద్రుడవు కావు. యవ్వనుడవు
కాదు, వృద్ధుడు కాదు, స్త్రీ కాదు, పురుషుడు కాదు. టీచరు కాదు. విద్యార్థి కాదు. కనుక నేమనము
యీ దేహభ్రాంతిని వుంచుకోటం చేతనే స్వస్వరూపానికి దూరమైపోతున్నాము. దానిని దర్శించు
కోలేకపోతున్నాము. తనకు తాను తెలుసుకోలేకపోతున్నాడు. కనుక నే యెవరొచ్చినా who
are you? అంటే I am so and so అని దేహానికి సంబంధించిన పేరు రూపాన్ని చూపి
స్తూ వుంటాడు. కనుక మానవుడు తన యదార్థాన్ని, తన సత్యాన్ని, తన స్వరూపాన్ని, గుర్తించుకో
లేకపోవటానికి కారణము యేమిటి మహాపాప ఫలితమైన మలము. అనగా దుర్బుద్ధుల
యొక్క ఫలితము. తర్వాత చంచలత్వము చేత తన స్వరూపాన్ని తాను గుర్తించుకోలేక

పోతున్నాడు. ఈ దేహభ్రాంతి అనేది ఆవరించటం చేతనే, యీ ఆవరణ చేతనే తన స్వస్వరూపాన్ని తాను గుర్తించుకోలేక పోతున్నాడు. కనుక సత్యాన్ని గుర్తించవలెనంటే మొట్టమొదట మలాన్ని దూరం చేసుకోవాలి. అనగా దుర్భావములు, దురాలోచనలు, దుర్గుణములు యెన్ని జన్మలనుండి వచ్చిన టువంటివో. ఆ జన్మలనుండి వచ్చినటువంటివి అయినప్పటికి యీ జన్మలోనైనా యిలాంటి దుర్భావములు దుర్వృత్తులు, దురాలోచనలు, దుశ్చేష్టలు లేకుండా దానిని భగవచ్చింతన చేత పరిహారం గావించటానికి ప్రయత్నించాలి.

ధ్యానము, జపము, భజన యిత్యాది పవిత్ర కార్యములు, కర్మల చేత మనలో యేకాగ్రత ను పెంచుకోవాలి. ఈ విధమైన రీతిలో చేస్తున్నప్పుడు మనసు క్రమక్రమేణా యీ దేహముపైవుండే భ్రాంతి పోయి 'సర్వం భగవత్ప్రీత్యర్థం' ఇది దైవానికి అర్పితము అనే అర్పణ భావము మనలో ప్రారంభ మౌతుంది. ఈ మూడింటి యొక్క వి మోచన లేకుండిన వాని జీవితమే దుర్వినియోగమవుతుంది. బంధనలో చిక్కుకొని భ్రష్టుడై పోతాడు. కనుక మానవుడు మొట్టమొదట తన యొక్క సత్యాన్ని గుర్తించు కొని, తన యొక్క స్వరూపాన్ని దర్శించుకోటానికి తగిన కృషి చేయాలంటే దుర్బుద్ధులు మానుకోవాలి. దుశ్చేష్టలు వదలుకోవాలి. దుష్కర్మలన్నీ స్తంభించిపోవాలి. మనం తప్పులు లేకుండా చూసుకోవాలి. తప్పులను మనం చూసుకోవాలి గాని punishment యెలాంటిది అని మనం పరిశీలించకూడ దు. అరే! చిన్న తప్పుకు పెద్ద పనిష్మెంటా అని గొప్ప విజ్ఞానివలె మనం విచారిస్తూవుంటాము. ఇది చాలా అజ్ఞానము యొక్క దోషము. తప్పు చేయటం పెద్ద తప్పు. ఆ తప్పు చేసినవానిని నీవు తప్పు చేసినావు కాబట్టి పెద్ద punishment, చిన్న punishment. నీవు తప్పు చేయకుండావుంటే punishment లేదు. కనుక తప్పు చేయటమే ప్రధానమైన తప్పు. ఈ తప్పులు లేకుండా చూచుకోమని అతనిని మందలించాలి గాని, చిన్న తప్పుకు పెద్ద punishment అని తెలివితే టలు కల పెద్దలవలె మనం భావించటమనియిది పరమ అజ్ఞానం. తెలుగులో చెప్తారు. చిన్నపాముకైనా పెద్ద కర్రతో కొట్టాలని. చిన్న తప్పైనా పెద్ద దెబ్బ కొట్టాలి. అప్పుడే వాడు పెద్ద తప్పులు చేయటానికి పూనుకోకుండా వుంటాడు. కాని యింతటి విజ్ఞానుడొకడు లేడు. అజ్ఞానులతో అజ్ఞానులుగా చేరి పోయి మరింత అజ్ఞానము పెంచుకోటం చేత తప్పులు మితిమీరి పెరిగిపోతున్నాయి. కనుక యీ పెద్దల వల్లనే పిల్లలు కూడా మరింత మితిమీరి పోతున్నారు. భజనలో కూర్చుంటారు. ఎక్కడైనా కాని భజన భజనే. మందిరంలో చేయు భజనే. Institute లో చేయు భజనే. Hotel లో చేయు భజనే ఎక్కడైనా భజన పవిత్రమైనది. ఆ సమయంలో యెందుకు మనం disturbance గా వుండాలి. ఎందుకు నమ్మే విధంగా కోతి చేష్టలు చెయ్యాలి. కదలటము, దగ్గటము, యింకా పిచ్చి పిచ్చి నవ్వులు నవ్వటం. ఇది నిజంగా స్వామిపైన ప్రేమ, విశ్వాసము వున్న వ్యక్తులు చేయవలసిందేనా? కాదు కాదు ఇది స్వామిపైన ప్రేమ, విశ్వాసం లేనివారు చేసే పని యిది. వున్నట్టుగా నటిస్తూవుంటారు. కాని అది వారు నమ్మవచ్చు. నేను నమ్మను. నిజంగా భక్తి విశ్వాసము వున్నవానికి యీ చేష్టలు రానేరావు.

512028707

కనుక మనం భజనలో కూర్చున్నప్పుడు పవిత్రమైన రోనిలో వున్నప్పుడు, మనము చేతితో యేవిధమైన పనులు చేయకుండా మనసును స్తంభింప జేసి దైవ చింతనలోనే మనము మునిగిపోవాలి. ఆరకమైన దానికి ప్రయత్నం అన్నా చేయాలి. అంతే కాని నీకు యిష్టంలేకపోతే కూర్చో. నీకేది యిష్టమో దానిని స్మరించుకుంటూ కూర్చో. అంతేకాని యిష్టం లేక దగ్గటం యిలాంటి వన్నీ చేస్తే యిది రౌడీలు చేసినట్లుగా వుంటుంటి. ఇది మన విద్యార్థులకు వికారమైన బుద్ధులే కాని సద్బుద్ధులు కానేరవు. భజనలో కూర్చుంటారు. ఎప్పుడు చూచినా కాని కదలుతూ దృష్టినంతా కూడ disturb చేస్తుంటారు. ఎందుకు కదలాలి? నీకా మాత్రం స్థిరత్వం లేదా? ఈ వయసులోపల మీ యొక్క శరీరాన్ని మీరు యింత మాత్రము control చేయలేకపోతే మీరు slaves not masters. తన యింద్రియాలను తాను control చేసుకున్నవాడే master. తన దేహాన్ని తాను అదుపులో పెట్టుకున్నవాడే master. తన బుద్ధిని సరైన స్థితిలో పెట్టుకున్నవాడే master. లేకపోతే senseకి slave. bodyకి slave బుద్ధికి slave. వీడు complete జగత్తుకి ఒక slave అయిపోతాడు. కనుక మీరు masters కావాలి గాని slaves కారాదు.

కనుక యిది యెక్కడ ప్రారంభం కావలంటే, పిల్లలందరు యెక్కడ చేరుతున్నారో అంటే Hostel లో ప్రారంభం కావాలి. నిజముగా Hostel లో క్రమశిక్షణ సరిగ్గా వుంటే యీ యొక్క భజనలో గాని, Institute లో గాని యే రకంగా చలించటానికి అవకాశమే లేదు. కనుక యీ యొక్క discipline మొదట Hostel లోనే చెడిపోతోంది. నేను కూడను భజనలకు ప్రశాంతి నిలయం వచ్చినప్పుడు చూస్తూ వుంటాను. అక్కడ కూడా భజనలో ముందు కూర్చొని వుంటారు. ఆడవాళ్ళంతా వుంటారు. నవ్వటం, మాట్లాడటం, కదలటం యీ విధముగా కోతులకంటె హీనంగా ప్రవర్తిస్తూ వుంటారు. కనుక హాస్టలులో మీరు స్టెడిగా వున్నప్పుడే Institute లో స్టెడిగా వుండవచ్చు. ఇక్కడ మీరు స్టెడిగా వున్నప్పుడే మందిరంలో కూడా స్టెడిగా వుండవచ్చు. హాస్టలులో మొదట చెడిపోతున్నారు. అందరూ పిల్లలతో పాటు పెద్దలు కూడా నవ్వటం, మాట్లాడుకోటం యిదంతో మొదట హాస్టల్ లో discipline లేకుండా పోయింది. ఏదో వీరు Hostel లో వున్నామని భ్రమిస్తున్నారు. కాని యిది పూర్తిగా మూర్ఖత్వము. అన్ని విధాలా సరైన పిల్లలుగా తయారు కావలసింది హాస్టలులో. ఇది కేవలం దిక్కులేని హాస్టలుగా తయారౌతోంది. తప్పుకు తగిన punishment లేకుండా పోతోంది. అక్కడక్కడ ఒకరితో ఒకరు పోట్లాడుకున్నా చర్యతీసుకోటం లేదు. వీరు చచ్చినారా బ్రతికినారా? దానికెందుకు action తీసుకోకూడదు. నేను చదువుకోసం Institute స్థాపించలేదు. Discipline కోసం చేశాము. ఇంకే విధముగా డబ్బుకోసం దానిని నేను స్థాపించలేదు. అందువల్లనే ఒక్క నయాపైసమును ఫీజు తీసుకోటం లేదు. స్కాలర్‌షిప్ లంతా యిచ్చి వీళ్ళకు కూడు పెట్టి, బట్టలిచ్చి పోషించి యింత చేస్తే యిలాంటి వాళ్ళనెందుకు punish చేయకూడదు తప్పు చేస్తే? ఈ విధంగా ఒక్క తప్పును మనం క్షమించుకుంటూపోతే యనేక తప్పులుగా

బయటబడేరి పోతున్నాయి. అక్కడ వుండే పెద్ద దోషంయిది. ఈనాడు చిన్నదోషముగా పోతుంది. క్రమక్రమే ణాయింకా ప్రాణం తీసే దోషముగా బయటుదేరుతుంది. అప్పుడా మనం చర్యతీసుకోటం. అప్పటికి వీళ్ల ప్రాణం కూడా పోయే వుంటుండి. కనక Institute లో క్రమక్రమేణా ఒక ఖచ్చితమైన కొన్ని పద్ధతులు పెట్టి తీరాలి. ఉన్నవారు వుండవచ్చు. పోయేవారు పోవచ్చు. పది మంది పిల్లలు మాకు చిక్కినా చాలు. ఈ discipline లో యే ఒక్కదానిలోనైనా యీ వయసులో మరి పోయిందంటే యింక తరువాత వీళ్లు చేతికి చిక్కరు. కనుక యీ మానవత్వం విశిష్టమైనదని నిరూపించే చర్యలలో మనము ప్రవేశించాలి. జంతూనాం నర జన్మ దుర్లభం. ఎందుకోసం యీ నర జన్మ దుర్లభం. జంతువులవలె మనముకూడా ప్రవర్తిస్తే యింక నర జన్మ దుర్లభం అనే దానిలో విశిష్టత యేమిటి? కనుక యే కొంత మందియైనా మాకు డను చక్కని ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుచేసే Institute గా తయారుకావాలి యిది. విజ్ఞాన వివేకములతో కూడిన వాతావరణము యిందులో సర్వత్రా వ్యాపించి పోవాలి. విద్యార్థులు యెక్కడి కి పోయినప్పటికిని వారి discipline స్పష్టంగా వుంటుండాలి. ఈ స్పష్టతే లేకపోతే యింక యెందుకో సం యీ జీవితము? ఎందుకోసం యీ చదువులు? Play ground లో వున్నా అక్కడ కూడా మన ము సరైన రీతిలో అదుపులో పెట్టుకోవాలి. బజారులో వున్నాము యొక్క discipline అక్కడ కూడా వుండాలి కేవలం ఒక చోట మాత్రం వుండి రెండవ చోట లేకుంటే యేమి ప్రయోజనము. Circus లో వుండే animal ఫీట్సు చేసినప్పుడు చాలా discipline గా వుంటుండి. చాలా control గా వుంటుంది animal కదా. కాబట్టి యీ Institute లో నేర్పేది Circus కాదు. సద్గుణములు.

కనుకనే ప్రత్యేకమైన కొన్ని కమిటీలు పెట్టి దీనిని సరైన మార్గములోనికి త్రిప్పటానికి ప్రయత్నం చేయాలి. దీనికి department committee అని ఒకటి వుండాలి. అనగా Physics, Chemistry, Botany, Mathematics, English యింకా యిలాంటి subjects అన్నిటికి ప్రత్యేకముగా కొన్ని కొన్ని కమిటీలు పెట్టాలి. ఈ కమిటీల లోపల మనం చేయవలసిన పని యేమంటే పిల్లలను వారి యొక్క భవిష్యత్తులో యే విధంగా వారిని తయారు చెయ్యాలి? వాళ్ల మార్గం యే విధంగా మనం మార్చాలి? వాళ్లకే విధముగా మనం బోధన చెయ్యాలి! ఏ విధముగా టెస్టులు పెట్టాలి! ఏ విధముగా సరైన మార్గములోకి తెప్పించాలనే విషయాలను వీరు చక్కగా చర్చించాలి. కనుక పురోభివృద్ధి నికోరే తత్వంలో యీ టీచర్సు అంతా వీనిని ప్రయత్నపూర్వకంగా సాధించాలి. నేను చెప్పిన పాఠం పిల్లలు సరిగా అర్థం చేసుకున్నారా? లేదా? మధ్యమధ్యలో పాఠం అయిన వెంటనే వాళ్లను questions అడగాలి. దానినే slip test అంటారు. మధ్యమధ్యలో quiz పెట్టాలి. వాళ్లకు యే విధముగా అర్థం అవుతుందో, తెలియని విషయాలను పిల్లలకు చెప్పి ఎవరైనా కాని సరిగ్గా జవాబు చెప్పేటట్లుగా వారిని ట్రైనింగు యివ్వాలి. ఆ డిపార్టుమెంటుకు తగిన రీతిగా నోటుబుక్కు యే రీతి గా వుంచుకుంటున్నారు అని check చెయ్యాలి. ఈ విధంగా ఆయా డిపార్టుమెంటులు ప్రత్యేక కమిటీలు పెట్టుకొని యివిక్రమక్రమేణా పిల్లల యొక్క పురోభివృద్ధికి తగిన వుత్సాహ ప్రోత్సాహములను

512028709

అందించే విషయాన్నిమనము తెలుసుకోవాలి.

తరువాత రెండవది. Faculty committee. అనగా అన్ని subjects వారు చేరాలి. ఫిజిక్సు వారు చేరవచ్చు. Mathematics వారు చేరవచ్చు. Chemistry వారు చేరవచ్చు. Bio science వారు చేరవచ్చు. అందరు చేరి అక్కడ వుండే ఒక్కొక్క ప్రొఫెసరు, డీను యిందులో చేరి క్రమక్రమేణా దీనిని కొంతవరకు విచారణ చెయ్యాలి. ఇందులో చాలా విచారించవలసిన విషయములు గుప్తంగావున్నాయి. ఇప్పుడు P.C.M. Physics, Chemistry Mathematics యిదొక group. ఒకనికి physics లో మాత్రం 85% మార్కులొచ్చాయి. Chemistry లో 18% Maths లో 20% వస్తే వీడెలా pass అవుతాడు. ఒక subject లో మంచి high మార్కులు వచ్చి మిగతా subjects లో తగ్గిపోతే వీడెట్లా పాసౌతాడు! ఎందుకోసం తగ్గిందని ఆలోచించి తగిన విచారణ చేసి, కారణములేమిటో కనుక్కొని తద్వారా అన్నికూడను దానికి సమానముగా వచ్చేటట్లుగా మనం ప్రయత్నం చేయాలి. కనుక యీ కమిటీలో Physics teacher వుండాలి Mathematics teacher వుండాలి. Bioscience teacher వుండాలి. Chemistry teacher వుండాలి. అందరు చేరితే కాని యీ balance తేవటానికి కుదరదు. వీటిని సరిదిద్దేలోపల యీ teachers లోపల యే విధమైన స్వార్థము, స్వప్రయోజనము, ఏ రాజకీయములో, ఏ అహంకారము యిందులో యే మాత్రం కూడను పని చేయకూడదు. కేవలం physics లో మంచి మార్కులు వచ్చాయి అది నా subject అని అతను అహంకారిగా పోకూడదు. అదినీ సబ్జక్టే కాక student యొక్క యింటరెస్ట్ అది చెప్పటానికి వీలు కాదు. కనుక పెద్దమార్కులు తెప్పించు కున్న subject గాని తక్కువ మార్కులు వచ్చిన subject వారు వీరంతా కలసి దీనికి కారణాలేవో గుర్తించటానికి వీలవుతుంది. కనుక యీ కమిటీలో చాలా పని చేయవలసిన అవసరం వుంటుంది.

మూడవది Academic committee. ఈ కమిటీ ఒక heart వంటిది. మిగతా ప్రదేశాలలో, మిగతా Universities లో యీ కమిటీలో వుండే అల్లర్లు యింకెక్కడాకూడా వుండవు. అక్కడంతా టేబుల్స్ టేబుల్స్ పోట్లాడుకుంటూ వుంటాయి. ఈ కమిటీలో అన్నిరకముల సమస్యలను అక్కడ చర్చించటానికి మనం ప్రయత్నం చేయాలి. ఇందులో Deans, Professors, Vice Chancellor వుండాలి. వీళ్ళందరు కూడను సంప్రదించి next year లో యేంచెయ్యాలి? ఏ విధముగా పరీక్షపేపర్లు మనం తయారు చేయాలని చాలా వరకు విచారించాలి. కొంతమంది టీచర్సు యేమి చేస్తున్నారంటే Last year question పేపర్లే యిచ్చేస్తున్నారు. ఇది కేవలం టీచర్సులో వుండే Laziness. ఈ question bank లో దండిగా కావలసినంత తయారు చేసుకోవాలి. మనం ఒక్కతూరి యిచ్చినవి మరొక్కతూరి యివ్వకుండా చూసుకోవాలి. Last year యేమిచ్చాము యీ year యేమి యిస్తున్నాము అనే తారతమ్యం చూసుకుంటూ రావాలి. ఇది ఒక సేవగా మనం భావించాలి. ఇదేదో మనం చేయవలసిన

duty అనే భావంతో చేయకూడదు. ఇది స్వామిసేవ అనే భావముతో చేయాలి. నీకూ తృప్తి, పిల్లలకు తృప్తి, స్వామికి తృప్తి. కనుక యీ విధమైన సమభావముతో, శాంత భావముతో, విశాలభావముతో యీ కమిటీలో మనం తగిన పని మనం చేయాలి. ఇక్కడ కొంతమంది Professorలు కూడను చక్కగా విచారణ చేయాలి. ఈ Professorలుగాని Lecturersగాని Deansగాని యే స్థానములో మనం వుంటున్నాము, యే స్థానము నుండి మనం దీనిని యే విధముగా తయారు చెయ్యాలనే విషయాన్ని మీరు చక్కగా విచారణ చెయ్యాలి. కనుక అప్పుడప్పుడు మీరు అందరు మీటింగు పెట్టుకొని ముందు ముందు మనమే రీతిగా చేయాలనే విషయాలను సంప్రదించాలి.

అధ్యాపకులారా! మీరు వేరుగా భావించరాదు. మేము డబ్బు విషయములో యే మాత్రం కూడను వెనుకంజ వేయము. ఎన్ని లక్షలైనా, ఎన్ని కోట్లైనా మేము యివ్వటానికి సిద్ధముగా వున్నాము. నిజముగా మేము డబ్బును ఆశపడే వారమవుతే యెందుకు ఫీజు కలెక్టు చేయటంలేదు? గవర్నమెంటు నుండి యెందుకు జీతాలు collect చేయటంలేదు. ఒక్క పైసా UGC గాని గవర్నమెంటు గాని జీతాలు యివ్వటం లేదు. అంతా ట్రస్టు తరఫునే యిస్తున్నాము. ఏ పిల్లల నుండి మేము నయాపైసా తీసుకోటంలేదు. అంతా కూడా ట్రస్టు యిస్తోంది. ఇది డబ్బు ఆశతో కాదు. మీరనుకుంటారు డబ్బు యివ్వటంలేదే అనుకుంటారు. కాని మీరు Professorలు వుండవలసిన స్థానంలో మీరు వుండటంలేదు. అందువలనే యీ కొన్ని యిబ్బందులు కలుగుతున్నాయి. మీరు అడగవలసిన రీతిగా మీరు అడగాలి. Physics Professor వస్తాడు. మాకు నాలుగు లక్షలు కావాలి. Chemistry Professor వస్తాడు మాకు మూడు లక్షలు కావాలి. MBA Professor వస్తాడు. మాకు ఐదు లక్షలు కావాలంటాడు. నిజమే అడగవచ్చు. కానీ మేము యిలా అంటే అలా యివ్వటానికి వీలవుతుందా? Proposal తీసుకురా. తప్పక మేము యిస్తాము. ఎలా మనం అడగాలి. దేనికి దేనికి యెంతెంత అనేది ఖచ్చితంగా మీరు మీటింగు పెట్టుకొని వ్రాసుకొని తీసుకువస్తే బావుంటుంది. నాకు నాలుగు లక్షలు కావాలంటే మేమలా యివ్వటానికి వీలుకాదు. మీరు యేదేది దేనికి కావాలని proposal తీసుకొని రండి తప్పక మేము యిస్తాము. ఇది Professorల యొక్క బాధ్యత క్రింద వుండాలి. అలా కాకుండా proposal వుండదు, దేనికేది కావాలో మీటింగు పెట్టుకోరు. ఒక కమిటీ నిర్ణయించేసుకోటంలేదు. మాకు ఐదు లక్షలు, నాలుగు లక్షలు కావాలంటారు. ఇది యేమైనా మార్కెట్ అనుకున్నారా లేక మార్వాడి యిల్లనుకున్నారా? ఆ డిపార్టుమెంటు అంతా కలుసుకోండి. నీకేదేది కావాలి నీకేదేది కావాలి అని అంతా ఒక ప్రపోజల్ తయారు చేయండి. దానిపైన ఫలానా దానికి యింత డబ్బు, ఫలానా దానికి యింత డబ్బు అని వ్రాసుకొని తీసుకురండి. నిముషంలో మేము యిస్తాము. ఇవన్నీ యేమైపోయిందంటే పూర్వము ఆ గవర్నమెంటు కాలేజీల్లో అక్కడా యిక్కడా చేసిన అభ్యాసాలు యీ రకంగా వస్తున్నాయి కాని ఆ అభ్యాసమునకు యీ అభ్యాసమునకు చాలా వ్యత్యాసముంది. అక్కడెవరూ అడిగే దిక్కులేదు. వాళ్ళకంత rigour వుండదు. కానీ మాకు చాలా rigour వుంది. ఈ పొద్దు వుండవచ్చు రేపు పోవచ్చు టీచర్సు కానీ మేము శాశ్వతంగా

వుండేవాళ్ళము. మేము దానిని అభివృద్ధిగావించుకుంటూ పోవాలి. మా department కు యిది లేదు అదిలేదు అనిచెప్పుకోటం యిది చాలాఅవమానకరం. ఆవిధముగాచెప్పకూడదు. మీరు proposals యివ్వండి. మేము యిస్తాము. proposal లేకుండా ఒక్కనయాపైసాఅయినాయివ్వటానికి వీలుపడదు. మీరువుండేది దేనికోసం. మీరుproposals అవియిందుకుతయారు చేయకూడదు. మీకుయిందుకుజీతాలిచ్చేది? మీ duty మీరు చక్కగాచేయాలి. కనుకనేయీ విధమైనకమిటీలను పెట్టుకొని దీనిని సరైనరీతిలోచేస్తే యెంత ఆదర్శవంతమైన రీతిగావుంటుంది మన Institute. డబ్బుకోసం మీరే మాత్రము విచారించనక్కరలేదు. ఎన్నిలక్షలుకావలసినాయివ్వటానికిసిద్ధముగావున్నాను. కాని సరైనరీతిలో మీరుఅడగాలి. సరైనరీతిలోమీరుతీసుకోవాలి. ఎవరంటేవారు స్వతంత్రముగా యేదానికంటే ఆదానికంతా orders యివ్వకూడదు. మీరందరు మీటింగుపెట్టుకొని యేదికావాలోచూచుకొని ఒక్కతూరి యివ్వండి. అన్నిఒక్కతూరి తెప్పించవచ్చును. ఒకప్రొఫెసర్ ఒకటి అడుగుతే, యింకో డీన్ యింకొకటి అడిగితే, యింకో lecturer యింకొటి అడుగుతే ఏ విధముగాతెచ్చిపెట్టేది! దానికి దీనికి సంబంధంవుండాలికదా. అన్ని ఒక్కతూరి మనకు లభించేమార్గంలో మీరు చక్కగా plan వేసియివ్వండి. కనుక యీ academic committee లోపల యీవిషయాలన్ని చర్చించాలి. ఏది చేసినాకాని పిల్లలయొక్క అభ్యున్నతికి తగిన లక్ష్యంపెట్టుకోవాలి. అయితే ఎవరెవరు యేయేస్థానంలోవుంటున్నారో వారి వారి మర్యాదలు వారు కాపాడుకోవాలి. ఆ respect కి తగినరీతిలోమనంనడచుకోవాలి. మనకు Rights తోపాటు Responsibilities కూడావుంటున్నాయి. ఈరెండు రెండుపాదములవలెనడవాలి. యీరెండు పట్టాలపైన నడచినప్పుడే యిది సక్రమమైనక్షేమాన్ని పొందుతుంది.

నాల్గవది లైబ్రరీకమిటీ. ఈ లైబ్రరీకమిటీలోపల కొంతవరకును, ఏది మనకు useful, ఏది useless ఏది మనకి అవసరము? ఏది మనకు అనవసరము. ఇప్పుడు foreign నుండి 120 మాగజైన్లు వస్తున్నాయి. మనయిండియానుండి 80 మాగజైన్లువస్తున్నాయి. ఈ మాగజైన్లుఅంతా పిల్లలకేమైనా సహాయంగా వుంటున్నాయా లేదా? టీచర్సుకు యేమైనావుపయోగంగావున్నాయా లేదా! వుపయోగంగావుండేవియెన్నైనా తీసుకోండి సంతోషమే. అవసరంకానివి తీసుకొని దీనివల్లమనం యెంతనష్టపడతాము. కనుకయిక్కడ మీరు అందరూచేరి కనుక్కొని మనకేది అవసరమో అవి తీసుకోండి. ఎందుకంటే నాస్వభావము అలాంటిది. ఒక్కచిన్నదానిలోనైనా waste చేయటం నాకిష్టంలేదు. నేను యిప్పుడు perfect. ఒక చిన్నవిషయం చూడండి. ఒకటంబ్లరు వుంది. రాధాకృష్ణనుకూడా తెలుసు. నేను ఒకతూరి నీళ్ళు తాగుతాను. త్రాగినాక మిగిలిననీళ్ళుంటాయి. ఈ మిగిలిననీళ్లను నేను పారపోయను. ఎందుకంటే యీపారపోయటం waste అని దాన్ని అలానేవుంచి మూతపెట్టి యింకోతూరి త్రాగుతాను. ఒకనీళ్ళేకాదు. కరెంటుగాని, యింకేవిధమైన పదార్థంకాని ఏదైకూడ నేను waste

చేయను. అందుకే మీకు కూడా చెబుతున్నాను. ధనము కూడా waste చేయకూడదు. ఈ పవిత్రమైన ధనము మనము దుర్వినియోగము చేయుటము మహాపాతకము. కనుక నేను misuse of money is evil. దానిని దుర్వినియోగము చేయకుండా మీకు అవసరం వచ్చినప్పుడు తీసుకోండి. తప్పక మీరు ఆనందాన్ని అనుభవించవచ్చు. Institute కి మంచి పేరు వస్తుంది. ఇంకా లైబ్రరీకి కొన్ని పుస్తకాలు కావాలి. U.G.C యిస్తోంది కదా ఐదు లక్షలు పది లక్షలు. UGC అయితేనేమి యివ్వరైతేనేమి యెవరిచ్చినా useful గా వుపయోగపెట్టుకోవాలి గాని useless గా వుపయోగపెట్టకూడదు. కాని మిగతా universities లో UGC నుండి వచ్చింది కదా అని యిష్టం వచ్చినట్లు చూచిన books అన్ని కొనటం లైబ్రరీ పెద్దగా చేసుకోటం. వీనిలో పనికి వచ్చేది యేమిటి అని మనము చూడటం లేదు. కాని అవసరమైనవన్ని మనము తీసుకోవలసిందే. తప్పులేదు. ఆ సబ్జక్టుకు కావలసిన books అన్ని మీరు తీసుకోండి.

ఇంకా కొన్ని విషయములు మీరు చక్కగా గుర్తించాలి. ఒక P.hd teacher ఒక P.hd student వారికి యిష్టం వచ్చిన subject పైన వారు P.hd లు చేస్తున్నారు. జగత్తులో యేదో ఒక subject తీసుకొని దానిపైన వ్రాస్తుంటారు. ఆ subject ఆ Guide కి తెలీదు. పాపం యేదో వాళ్ల వ్రాసింది వప్పుకొని సైన్ పెడుతుంటాడు. ఈ విధముగా Phd students వందలు వందలు books సంవత్సరానికంతా తయారవుతున్నాయి. ఇంకా యిందులో యెలా వుందంటే వాడు వ్రాసింది యింకొకరు తప్పని యింకొకరు Phd వ్రాస్తాడు. ఇవన్నీ చూస్తే ఒక్కటి కూడను పనికొచ్చేవి వుండేవు అక్కడ. ఈ వందల పుస్తకాలు మనం తీసుకోనక్కరలేదు. Important books మనం తీసుకుందాము. అన్నింటిని క్రోఢీకరించిన books మనం తీసుకుందాము. దానితో మనం పని చేసుకోవచ్చు. ప్రతీ book తీసుకోటం. దానిలో వున్నదే దానిలో వుంటుంది. రెండూ ఒక్కటిగానే వుంటాయి. ఇలాంటి books మనం తీసుకొని waste చేయకూడదు. లైబ్రరీలో దండిగా books వుంటున్నాయి యేమి ప్రయోజనము. ఇది ఎలా వుందంటే ఒక సామెత వుంది. బోదలు చూస్తే జాలి జేబులు ఖాళీ. మనకు యేదో books పైన ఆశ వుంటుంది గాని books లో చూస్తే యేమీ వుండదు. కనుక పనికొచ్చే books కొన్ని వేలు వున్నా మనకి చాలు. పనికిరాని పుస్తకాలు లక్షలుంటే యేమి ప్రయోజనము. లైబ్రరీ చూచి అబ్బా యెంత పెద్ద లైబ్రరీ. ఎంత పెద్దది అంటారు. ఇది వాళ్ల తృప్తి. వాళ్లను తృప్తి చేయటానికి కాదు మనం ప్రయత్నించాలి. మన తృప్తి. self satisfaction అవసరం. అసలు ఈ books అన్నీ చదువుతున్నారా లేదా అనేది కూడా గుర్తించటం లేదు. కనుక మన professors అంతా యెంత డబ్బు ఖర్చైనా సరే మీకవసరమైన books తెచ్చుకోండి. వాటి లిస్టు ముందుగా తయారు చేసుకోండి. ఏవి మన దగ్గర వున్నాయి. ఏవి మన దగ్గర లేవు. ఈ రెండింటిని విచారించి మీకు కావలసినవి తెచ్చుకోండి. కనుక యిది ఒకరిద్దరు

512028713

చేయుటానికి వీలుకాదు. కనుక యిది ఒక ఐదారు మంది చేరి దీనికి కూడా ఒక సరైన మార్గాన్ని నిర్ణయించుకున్నప్పుడే పిల్లలకు మంచి అభివృద్ధి వస్తుంది. అన్నివిధాలా ideal గా వుంటుంది. కనుక లైబ్రరీ కమిటి ఒకటి తప్పక వుండాలి.

ఇంక sports and cultural activities యీ రెండిటికి చేరి ఒకే కమిటీ వుంది. ఇక్కడ మన పిల్లలు చక్కగా గుర్తించాలి. ఆటలెందుకు పెట్టారు? పరులపైన పోటీపడి వారిని ఓడించాలి. మనం జయించాలి అనే దుర్భావములు మనలో రాకూడదు. మిగిలిన చోట్ల sports యెక్కువ encourage చేస్తుంటారు. ఎందుకంటె మా college students sports లో జగత్ప్రఖ్యాతి పొందినారంటే ఆ కాలేజీకి అదొక గొప్ప విలువ. అలాంటి పేర్లు మనకు అక్కరలేదు. ఇది కేవలం ఒక business type లో పోతోంది. ఆటలాడేది మనందరి కోసం మన ఆనందం కోసం, ఆరోగ్యం కోసం. ఈ ఆనందం మనం అనుభవించాలి. ఆరోగ్యాన్ని పొందాలి. దీనిలో ఒకరితో ఒకరు పోటీలు పడి ద్వేషాలతో యీ పోటీలలో జయించరాదు. ఎప్పుడు పోటీ పడతారో అప్పుడు difference వస్తుంది. ఈ కాంపిటీషన్ మాత్రం వుండకూడదు. ఈ ఆరోగ్యని మిత్త మై మనము యేమి చెయ్యాలి, యే ఆటలాడించాలనేది వారు నిర్ణయము చేసుకొని యీ ఆటలకే సామానులు కావాలి, indoor games కి యేమేమి కావాలి అని కమిటీలో వీరు తయారు చేసుకోవాలి. పిల్లలకు ఆటలు చాలా అవసరం. లేకపోతే తిని కూర్చుంటే యింక ఏమీ పని చేయలేరు. ఉడిపి కృష్ణా కడుపు బరువు యెత్తలేను యేమి చేతు అనెనట. ఈ కడుపు భారం అయిపోతే యిక యే విధముగా పని చేయగలరు. చదవలేరు. అందులో ప్రతి విద్యార్థి కూడను ఆటలలో పాల్గొనాలి. కనుక దీనికి తగిన ఒక కమిటీని చక్కగా నిర్ణయము చేసి తద్వారా regular గా జరిగేటట్లుగా మనం చూసుకోవాలి.

ఇంక ఆరవది Hostel committee. ఈ హాస్టలులో కూడను ఒక కమిటీ వుండాలి. పిల్లలు అధికముగా వుండటం చేత చూసుకునే వాళ్ళకు కూడను చేతకాకుండా పోతుంది. ఒక చిన్న ఉదాహరణము మన పిల్లలందరు 100% యీ హాస్టలులోనే వున్నారు. అలాంటి సమయములో పల boys కి జబ్బుగాని, యేమైనా రోగం వచ్చినా, దెబ్బ తగిలినా, యింకేమైనా అనాను కూలం జరిగినా institute కి రాకుండా వుండటానికి కారణము వుంటుంది. ఏ జబ్బు లేక, ఏ రోగము లేక, ఏ నొప్పి లేక, ఏ కారణము లేకుండా institute కి రాకుండా వుండటానికి కారణం యేమిటి? చాల మంది పిల్లలు absent గా వుంటున్నారు. మీరనుకోవచ్చును. సాయిబాబా యెక్కడో వుంటాడు. ఎక్కడో తిరుగుతూ వుంటాడు. ఏదో భక్తులను చూస్తూ వుంటాడని. లేదు. లేదు. ప్రతి చిన్న విషయాన్ని నేను watch చేస్తున్నాను. education కి సంబంధించినది సాయిబాబాకు తెలియదు అని మీరు అనుకోవచ్చు. నేను అహంకారంగా చెప్తున్నానని కాదు. నాకు తెలియనిది యీ జగత్తులో ఒక్కటి కూడా లేదు. అదే Awareness

is life. కొంత మంది పిల్లలు తినటము, సరిగా యీ పిల్లలు అంతా క్లైనులో వచ్చేటప్పటికి, బొజ్జవేసు కోటం నిద్ర పోటం. ఎంతవరకు attendance వుండాలో అంతకంటె యెక్కువ వాళ్ళు వుపయోగ పెట్టు కున్నారు లేవులు. ఇక్కడ ప్రతి టీచరు కూడను వాళ్ళ క్లాసులో ఆ పిల్లలు వచ్చారా లేదా చూడాలి. నా వుద్దేశం మరొకటి నూతనంగా మనము చేయవచ్చును. మొట్టమొదలు prayer time లో attendance తీసుకోవాలి. కొంతమంది పిల్లలు యీ attendance తీసుకోగానే వెళ్ళిపోతారు. కాదు. కాదు ప్రతి పిల్ల వానిని watch చెయ్యాలి. అక్కడ Hostel లో అన్ని రూములు check చెయ్యాలి. పిల్లలు వారికి తెలియకపోవచ్చును. కాని పెద్దవారికి యింత కన్నపనేముంది. పిల్లలు సరైన ప్రవర్తనతో, సరైన నడతతో, సరైన రీతిలో కాలేజీకి రావటము, పాఠాలు చూసుకోటము, నేర్చుకోటము యీ విధముగా చేస్తున్నారా లేదా అని చూడాలి.

విద్యార్థులారా! మీరు కూడను కొన్ని గమనించవలసినవి వున్నవి. మాకు grade రావటం, marks రావటం ప్రధానమని తలచకూడదు. ఏ 'O' grade నీవు తెచ్చుకున్నావో, నీ ప్రవర్తనలో కూడ 'O' grade వుండాలి. కనుకనే కేవలం చదువు అనేది ఒకే దో grade తెచ్చుకొని certificate తీసుకొనిపోయి, బజారుల వెంట తిరిగి భిక్షమెత్తుకోటం కాదు మనకు. ప్రవర్తనే సరిలేకుండాపోయినప్పుడు, తమ కర్తవ్యాన్ని తాము చక్కగా గుర్తించలేనప్పుడు M.A చదివినా భిక్షమెత్తుకున్నా వానికి భిక్షం కూడా వేయరు యెందుకంటే దున్నపోతులా వున్నావు పని చేసుకోకూడదా, నీకెందుకు భిక్షం అని అడుగుతారు. కనుక యీ డిగ్రీలతో కాదు మనం వుండేది. నడతలతో వుండాలి. మంచి నడవడికను పెంచుకోవాలి. కనుక మనం బాగా పని చేయాలి. మనం సాధనతో దేనిని సాధించవచ్చును. Practice makes man perfect అన్నారు. కనుక మనము practice చేయాలి ఆ విధముగా. ఈ వయసు చాలా విలువైనది. ఈ విలువను మనము పాడు చేసుకుంటే తిరిగి మన జీవితంలో లభించదు. ఇంత ప్రేమతో, యిన్ని విధములుగా, చిన్న చిన్న విషయాలలో కూడను శ్రద్ధ తీసుకొని చెప్పేవారు యెవరు మీకు లేకపోటం చేతనే వేరే విధమైన పరిస్థితిలో వుంటున్నారు. కనుక మనము యీ విధముగా మన Hostel లో కూడను ఒక కమిటీని పెట్టుకొని పిల్లలకు అవసరమైన food సరైన రీతిలో యిస్తున్నారా లేదా? యిది యేరీతముగా వుంటుంన్నది చూచుకోటానికి ఒకరు వుండాలి. Food లోపల శుచి రుచి అవసరం. ఏదో చేసినారు కదా, తట్టలో వేసినారు కదా మనం పొట్టలో వేసుకుందాం అని ఆరకంగా పోకూడదు. దానికి తగిన రుచిని కూడా అందించాలి. పిల్లలకు జిహ్వా చాపల్యం వుంది కదా కనుక వారికి సరైన food యివ్వాలి. ఎందుకంటె డబ్బు కడుతున్నారు. డబ్బు కట్టే సమయంలో వారికి మంచి food యివ్వాలి. కనుక యీ కమిటీ వారు యేమి చెయ్యాలంటే యిది పొట్టలోకి వేసే పదార్థముగాని బుట్టలోకి వేసేది కాదు. దీనిని చక్కగా పెట్టాలి అనే భావాన్ని పెంచుకోవాలి. ఇంతే కాకుండా యీ Hostel silence. దీనిని ముందుగా మనము అభివృద్ధి

చేసుకోవాలి. ఒక చిన్న ఉదాహరణము. అక్కడ వుండే వాళ్లు చెప్పవచ్చును. అబ్బా! చాలా సైలెంటుగా వున్నారని చెప్పవచ్చు. ఇది కేవలం ఒక చెవిటితనము. మార్కెట్టులోకి మనం వెడితే ఒకరికొకరు మాట్లాడేది యేమీ వినపడదు. అంతా confusion గా వుంటుంది. కాని మార్కెట్ కి కొంత దూరం గా పోయి చూస్తే అప్పుడు అక్కడ యెలా వుందో తెలుస్తుంది. ఆ రూములో ఆ రూములో వాళ్ళు బాగున్నట్లుగా కనుపిస్తారు చిన్నగా మాట్లాడుతూ. కాని బయటకొస్తే యివన్నీ యెకో భవిస్తాయి. అప్పుడు తెలుస్తుంది లౌడ్ స్పీకరు మాదిరి. కనుక Health, food, silence యీ మూడింటిని చూచువారు ఒకరుండాలి. ఇప్పుడు కూడా వున్నారు పాపం యేమి ప్రయోజనం. వున్నాడమ్మా మా పిల్లవాడు దండులో అన్నాడట. అంటే మిలట్రీలో అని. ఏం చేస్తున్నాడంటే చచ్చిన వాళ్లని యీడ్చిపారేస్తున్నాడట. war లో వుంటే యుద్ధం చేయాలి వాడు వీరుడు. కాని కొంత మంది సిపాయిలు వుంటారు. చచ్చిన వాళ్లని యీడ్చటం, పూడ్చిపెట్టటం, తలలు గొరగటం, యివన్నీ చేస్తారు. ఇవన్నీ సైన్యంలో వుండి చేసే పనా? పాపం కొంతమందికి మెడికల్ సంబంధమైన తెలియదు. ఏ జబ్బుకి యే మందివ్వాలో తెలియని సమయంలో వారిని హాస్పిటలుకు తీసుకుపోయి డాక్టరుకి చూపించాలి. ఈ health విషయంలో చాలా careful గా వుండాలి. ఎప్పటికప్పుడు చూచుకోవాలి. కొంచెం తేడా అయితే పెద్ద ప్రమాదమైనా జరుగవచ్చు. కనుక యీ Hostel లో పిల్లల ప్రవర్తన బట్టి, పిల్లల silence ను బట్టి, పిల్లల health ను బట్టి పిల్లలను చూచుకోటానికి ఒక ఇద్దరు మంది ఒక కమిటీగా వుండాలి.

Department committee అనేది ప్రతి నెలా 1st sunday meeting పెట్టుకోవాలి. ఈ Faculty committee వారు ప్రతి 2 months కి second sunday మీటింగు పెట్టుకోవాలి. ఈ Academic committee అనేది మూడు నెలలకొకసారి meet అవాలి. అది కూడను ఒక Sunday పెట్టుకోవచ్చును. ఇంక Games, Hostel, Library మటుకు ప్రతి పదిహేను దినాలకొకతూరి చూసుకోవాలి. ఎందుకంటె కొన్ని కొన్ని subjects అంతా మారుతుంటాయి. కొత్త పిల్లలకి అవసరమైనవి చక్కగా అందించాలి. తరువాత పిల్లలు చక్కగా చదువుతున్నారా? ఏ books చదువుతున్నారు. Novels చదువుతున్నారా subjects చదువుతున్నారా? కొంతమంది పిల్లలుంటారు. పెద్ద subject book తీసుకొని దాని మధ్యలో Novel పెట్టుకొని చదువుతూవుంటారు. ఇలాంటి చదువులలో మన పిల్లలను ప్రవేశపెట్టకూడదు. ఈ లైబ్రరీ చూచే అధికారులు కూడా యీ పిల్లలు యేమి చదువుతున్నారని వాచ్ చెయ్యాలి. ఇది చాలా పెద్ద పనే కాని ఒకరికి కాదు. Professors గాని Lecturers గాని, Readers గాని యెవరికైనా యిది చాలా పెద్ద పనే. కాని యిది ఒక సేవగా మీరు భావించి చేయాలి. ఇది ఒక పెద్ద సాధనగా మీరు విశ్వసించాలి. నిజముగా యింత మంది పిల్లలను బాగు చేయటమంటే యెంత గొప్ప ఫలితమో. ఎంత గొప్ప అనుగ్రహాన్ని పొందిన వారౌతారు. మన విద్యార్థులు ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారు కావాలి.

విద్యార్థులారా! మీరు మీ రూముల లోపల మీ మానిటర్సు కూడా వుంటున్నారు.

వాళ్లుపిల్లలే. పిల్లలు పిల్లలతో చేరి పోతున్నట్టుగావుంటున్నారు. కానీ మీరు ఒకరు చెప్పకుండా మీకు మీరే నడచుకొనే శక్తిని, స్వశక్తితో మార్పుతెచ్చుకొనేందుకు ప్రయత్నం చేయండి. తరువాత విచారించి ప్రయోజనం లేదు. తిరిగి యిలాంటి అవకాశము మీకు చిక్కుతుందని కలలో కూడ అనుకోకండి. ఈ చిక్కిన చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. Hostel లోగాని, Institute లోగాని, ప్రశాంతినిలయంలోగాని మీ discipline చక్కగా study గా కూర్చోటంలో యేకం చేయాలి. ఈ భజనలు, యింకే విధమైన ఉపన్యాసాలు చేసే సమయంలో యీ అలజడులను మాత్రం పుట్టించకూడదు. ఇది ఆరు నెలల నుండి ప్రారంభమైంది. ఇది జీవితంలో ప్రధానమైన ఘట్టంగా మనం భావించుకోవాలి. ఈ రూముల్లోపల ఒకరికొకరు యే విధమైన పోట్లాటలుగాని, ఒక విధమైన ద్వేషముతో గాని కొన్ని విధములైన పదములను ఉపయోగపెట్టకూడదు. పదిదినములకు ముందుగా ఒక రూములో అలా జరిగింది. ఒక పిల్లవాడు యింకో పిల్లవానిని కొట్టాడు. ఇలాంటివి మన Hostel లో జరుగవచ్చునా? ఇలాంటివి జరిగినప్పుడు దీనిపైన యిందుకు చర్యతీసుకోలేదు. ఈ విధముగా మనం తామసం చేయబట్టే మరింతగా పెరిగిపోతుంటాయి. ఇనుము యెఱ్ఱగా కాలినప్పుడే సుత్తితో వేస్తే యెంతవరకైనా సాగుతుంది. అది చల్లబడ్డాక యెవరు కొట్టినా సాగబడదు. అప్పుడు ఒక పిల్లవానికి తగిన punishment యిచ్చినప్పుడే యింకో పిల్లవాడు ఆ తప్పు చేయకుండా వుంటాడు. ఇది దయ కాదు. సోంబేరితనము యొక్క లక్షణము. ఇది సద్భావాన్ని అభివృద్ధి చేయటం కాదు. దుర్భావాన్ని అభివృద్ధి చేయటం. దయ మీకంటె నాకు లేదా? నాకు కావలసినంత దయవుంది. కాదు. కాదు. నాకు దయ కలిగిందంటె ప్రాణాన్నే యిస్తాను. కాని తప్పుచేసే ప్రాణాన్ని అయినా తీస్తాను. ఎందుకంటే తప్పు చేయకూడదు. తప్పులేని జీవితంగా మనం తయారు కావాలి. ఏదో ఒక్కతూరి చేస్తే క్షమాపణ. ఎప్పుడూ దానిని చేస్తుంటే ఒకరిని చూచి యింకా పదిమంది యిలాగే తయారౌతారు. ఆ విధముగానే యిప్పుడు పెరిగిపోయారు. ఇకపైన యెప్పుడైనాగానీ, భజనలోగాని, ప్రార్థనలోగాని, ఉపన్యాసాల్లోగాని బయట అటూ యిటూ తిరగటం, అలక్ష్యముగా తీసుకోటం, దగ్గటం తుమ్మటం యిది సరైనది కాదు. కొంచెం control చేసుకోనేందుకు యిది చక్కని అవకాశం. ఇలాంటి అవకాశమున్నప్పుడు మీరు అలక్ష్యముగా కోతుల వలె ప్రవర్తించటం యింకపైన యీ విధముగా జరుగు పేక్షణము కూడా మేము Hostel లోగాని, Institute లోగాని పెట్టుకోము. ఇంక జీవితంలో దీనిని చూడటానికి లేదు. కనుక మీరు జాగ్రత్తగా మెలగండి. Silence is God. ఈ silence లోనే వుంది నిజమైన దైవము. బయట శబ్దము లోపల కూడ నిశ్శబ్దము వుండాది. నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము అన్నారు. ఈ నిశ్శబ్దములో పవిత్రమైన దివ్యత్వమును అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ silence యేమి చేస్తుందంటే మిగతా వారికి కూడా help చేస్తుంది. మీరు దీనికి విరుద్ధంగా నడిస్తే మిగతావారికి కూడా harm చేసినవాళ్లవుతారు.

కనుక మనం యికపైన silence చాలా develop చేసుకోవాలి. మనసు నొక విధమైన యేకాగ్రత అభివృద్ధిపరచుకోవాలి. మన యొక్క మలమును, విక్షేపాన్ని, ఆవరణా

మనుశ్రమత్ర మేణా మనము తొలగించుకోటానికి ప్రయత్నించాలి. నీకడుపులో మలమెంతకాలమైనా వుంటే నీవు బ్రతకగలవా. వీలుకాదు. మొట్టమొదట దానిని బయటకు పంపాలి. అదే విధము గా నీలో వుండే దుర్భావములు నీలో వుంటుంటే యెప్పటికైనా అది నిన్ను వంచింపచేస్తుంది. కనుక పిల్లలందరు సత్యవాక్కులోపల, వినయములోపల, విధేయతలోపల నిజమైన క్వాలిటీగా మీరు తయారు చేసుకోవాలి. ఏదైనా మనము అడగవలసినా కాని, చెప్పవలసినా గాని వినయంగా మనము అడగాలి. వినయంగా మనము చెప్పాలి. ఈ అహంకారమనేది మానవుని అధఃపతనము చేస్తుంది. ఈ అహంకారమనేది టీచర్సు యందు గాని, పిల్లలయందుగాని యెవ్వరియందు వుండకూడదు. ప్రతి ఒక్కరు కూడను ఒక పవిత్రమైన రీతిగా మాట్లాడాలి. ఎన్ని పర్యాయములో చెప్పాను. ఈనాడు అధ్యాపకులు, పిల్లలు మాత్రం వుండటంచేత మనలో వున్న పొరపాట్లు మనం చక్కగా తెలుసుకోకలిగాం. ఈనాడు తెలుసుకున్నారు కనుక రేపటి నుండి యే విధమైన Remarks రాకుండా వుండటానికి ప్రయత్నించండి. మీరు ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారుకండి. దేశానికి యెంతైనా మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చి సగౌరవంగా జీవితాన్ని శాంతి జీవితంగా గడుపుకోండి. మీరు Ideal గా జీవిస్తే యెంత గౌరవంగా వుందే. శాశ్వతంగా సత్యమైన జీవితంగా మీరు గడిపితే ఎంత గౌరవప్రతిష్ఠలందుకుంటారు. ఒక చిన్న కథ జ్ఞాపకం వస్తుంది. కొద్దిసేపట్లో ముగిస్తాను. ఎక్కువ టైమ్ తీసుకున్నాను.

కృష్ణచైతన్యుడు తాను నృత్యంచేస్తూ తన్మయములో వున్నత్తని పాటె తాను ఒక విధమైన దైవత్వము యొక్క ఆత్మభావంలో లీనమై పోతున్నాడు. అక్కడ నవద్వీపపురమనే దానిలో ప్రవేశించాడు. అక్కడ రాజులు పెద్దపెద్ద వాళ్లందరు యీ కృష్ణచైతన్యుడు చేస్తున్న భజన చూచి వారు కూడా తన్మయులై పోయారు. వారు కూడా యీ భజనలో ప్రవేశించి వారి కిరీటాలు క్రిందపడే టట్లుగా ఎగురుతున్నారు. ఈ యొక్క తన్మయత్వములోపల ఒక దొంగ రాముడనే వాడు ప్రవేశించాడు. వాడు జీవితమంతా దొంగతనం చేయటం, అబద్ధాలాడటం. వాడు కూడా అందులో వచ్చినాటకమాడాడు, వాడు యెందుకోసం యీ పెద్దవారితో వచ్చినాటకమాడాడు. ఈ పెద్దపెద్ద రాజులంతా ఆటల్లో మైమరచి వుంటారు నేను కూడా వారితో ఆడుతూ వాళ్ల జేబుల్లోది మెత్తగా కొట్టేయవచ్చు కదా అనుకున్నాడు. కాని వాని అదృష్టము. వాడు తలచుకున్నది ఒకటి. అయితే ఆ జనంలో వచ్చి ఆడేటప్పటికి వాడు కూడను తన్మయుడైపోయాడు. వాడి దేహాన్నే వాడు మరచి పోయాడు. సరే అందరు వెళ్లినాక వీడు కాచుకొని వున్నాడు. ఈ చైతన్యుడు కూర్చొని పదిమంది పిల్లలతో మాట్లాడుతున్న సమయంలో పరిగెత్తి వచ్చి పాదాలపైన పడ్డాడు. స్వామి! అందరికి వుపదేశం చేస్తున్నారు నాకూ యేదైనా ఒక నామం చెప్పండి అన్నాడు. నీవు యెవరో నీ చరిత్ర నాకు మొట్టమొదట చెప్పమన్నాడు యీ చైతన్యుడు. స్వామి! నేను దొంగను. నేను దొంగతనము అసత్యము తోనే నా జీవితమంతా గడుపుతున్నాను. నా పేరు రాముడు అందరూ దొంగరాముడని

పిలుస్తారని వున్నదున్నట్లుగా చెప్పుకున్నాడు. అయితే నేను నీకు ఉపదేశమిస్తాను గురుదక్షిణ యిమిస్తావు అన్నాడు చైతన్య. స్వామీ! నేను యిది దొంగతనం చేస్తానో దానిలో కొంత మీకిస్తాను అన్నాడు. నాయనా నాకది అక్కరలేదు. ఇకమీదట నీవు దొంగతనం చేయనని మాట యివ్వు అదే నాకు గురుదక్షిణ అన్నాడు. స్వామి ఏమైనా యిస్తానుగాని ఆమాట నేను యివ్వనన్నాడు. అయితే పోనీ నీకు వుపదేశమిస్తాను. నీవు యెక్కడకు దొంగతనం చేయటానికి వెడతావో అక్కడ నేనిచ్చిన నామాన్ని 108 సార్లు జపించి తరువాత దొంగతనము చేయి అన్నాడు. మెత్రాదగ్గరకు పిల్చాడు. ఆ స్వామియొక్క సంభాషణలో వాని హృదయము చల్లబడింది. సంభాషణం సంకటనాశనం. దానితో భయం కొంతవరకు తీరింది. స్పర్శనం కర్మవిమోచనం దగ్గరకు పిలిచాడు వానిని. వాని తల పట్టుకున్నాడు. వాని చెవిదగ్గర నోరుపెట్టాడు. ఓం నమో భగవతే వాసుదేవాయ అని ఏకాదశ అక్షర మంత్రము నుపదేశించాడు. ఆ స్పర్శతో కర్మవిమోచనం అయింది. దర్శనం పాపనాశనం. సంభాషణం సంకటనాశనం. స్పర్శనం కర్మవిమోచనం. వెళ్లాడు వీడు. అందరు చైతన్యుని దగ్గరకు వస్తున్నారు శ్రీమంతులు కూడా వస్తున్నారు. ఇది మంచి ఛాన్సురా అని అనుకున్నాడు. ఆగ్రామములో వుండే మహాగొప్ప శ్రీమంతుడు, భార్యాపిల్లలు అంతా బయలుదేరి వచ్చారు. ఈ సమయం చక్కగా చూసుకున్నాడు. వారి ఖజానా కోసం వెళ్లాడు. బీరువాలు తీసాడు. అన్నీ కనిపించాయి. వజ్రవైఢూర్యాలు మాణిక్యాలు అన్నీ కన్పించాయి. చూచాడు. తలుపు తెరిచాడు. కూర్చున్నాడు. ఓం నమో భగవతే వాసుదేవాయ 108 సార్లు స్మరించాలి. అప్పుడు గాని అవి ముట్టటానికి లేదు. ఈ 108 అయ్యేలోపల ఆ యొక్క యజమాని, కుటుంబ సభ్యులంతా దర్శనం ముగించుకొని యింటికి వచ్చారు. ఆ శ్రీమంతుని భార్య తన నగలన్నీ తీసి పెడదామని రూమ్ లోకి పోయింది. కనుపించాడు యితను జపం చేస్తూ ఓం నమో భగవతే వాసుదేవాయ అని. చూచింది యీమె. ఏ మహానీయుడో మాయింటిలో ప్రవేశించి నామం చేస్తున్నాడని వెళ్లి భర్తను పిలుచుకొచ్చింది. ఆయనా చూచాడు. ఓం నమో భగవతే వాసుదేవాయ అనటం. వీరు ఎవరో మహనీయులు. మా అదృష్టం యీనాటికి పండింది అనుకొని వారంతా అతనికి పూజ చేసి, నమస్కారము చేసి యనేక విధములుగా అతనిని గౌరవిస్తున్నారు. ఎందుకంటే గ్రామంలోకి చైతన్యుడు వచ్చాడు. ఆయన దర్శనం కోసం వచ్చారేమో. జపం చేసుకోటానికి మాయింటికి ప్రవేశించారేమో అని యీరకముగా వృత్తము భావములంతా వారిలో వుప్పొంగుతూ వచ్చాయి. వీరు చేసేదంతా యీ దొంగ చూచాడు. జపం అయిపోయి కన్నులు తెరచి చూసేటప్పటికి అందరూ నమస్కారాలు చేస్తున్నారు. శ్రీమంతుడు నమస్కారం చేసి తమరెవరండి, ఎక్కడనుండి వచ్చారు. తమరు మహానుభావులు. మా జన్మ సార్థకమైంది యీనాడు. మాయింట్లో మీరు భోజనము చేసి మా ఆతిథ్యం స్వీకరించి మమ్ములను ధన్యులను చేయాలని ప్రార్థించాడు. అప్పుడు అతనిలో ఒక గొప్ప పరివర్తన వచ్చింది. అయ్యో నేను దొంగతనం కోసం వచ్చి యీవిధముగా భగవన్నామ స్మరణ వల్ల నాకే యింత గౌరవం యిస్తున్నారే నిజంగా నేను ఒక ఋషిగా తయారైపోతే యింకయెంత గౌరవాన్ని నేనందుకోవచ్చును. ఎంతవున్నత పదవిని పొందవచ్చును అని అను

కున్నాడు. ఛీ! ఈనాటి నుండి నేనింక దొంగతనము మాని నేను నిజమైన ఋషిగా తయారు కావాలని ఆ శ్రీమంతునికి నమస్కరించి, ఆమెకు కూడా నమస్కారం చేసి అమ్మా నేనొక దొంగనని యదార్థం అంతా చెప్పుకున్నాడు. నన్ను వదలండి నేను అడవికి వెళ్ళి భగవత్ చింతనతో నా జన్మ సార్థకం చేసుకుంటాను. సత్యమైన ఋషిగా నేను తయారౌతాను అని ప్రార్థించాడు. అప్పుడు వానికి ఒక పల్లకిలో వుంచి ఉత్సవం చేయించి అతనిని అడవిలో వదలిపెట్టారు. అతను కూడా దారిలో చైతన్యునికి నమస్కారం చేసుకొని స్వామి నేను నిజమైన శిష్యునిగా అయ్యేటట్లు ఆశీర్వదించండి. ప్రపంచానికి నేను సేవ చేయవచ్చు. అలాంటి ఉన్నత స్థాయికి పోయేటట్లుగా అనుగ్రహించండి. ఈనాటి నుండి యిక దొంగతనం మానుతాను అన్నాడు.

అదే రీతిగా మనము బూటకముగా భజనలో కూర్చున్నా, నాటకంగా భజనలో కూర్చున్నా మనకు విద్యార్థులమనే గౌరవము వుంటున్నప్పుడు, నిజంగా మనము సత్యమైన విద్యార్థులుగా, నిత్యమైన విద్యార్థులుగా, సాయిప్రేమకు సంబంధించిన విద్యార్థులుగా తయారైతే దేశమంతా మనలను గౌరవిస్తుంది. దేశానికంతా మీరు నాయకత్వం వహించవచ్చు. మీరు యెంతైనా గౌరవం పొందవచ్చు. కనుక మీరు నిజమైన భక్తులుగా, నిజమైన విద్యార్థులుగా తయారు కావాలని నేను ఆశిస్తూ, ఆశీరదిస్తూ యీ మల, విక్షేప, ఆవరణాలు పోగొట్టుకోటానికి ప్రయత్నం చేయాలని ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.